



భూములు తీసుకోవద్దు



అన్యాయం చేయొద్దని అధికారులను వేడుకొంటున్న రైతులు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని బసవపాలెం రెవిన్యూ పరిధిలో జిఎంఆర్ సంస్థకు కేటాయించిన 23 ఎకరాల భూములకు హద్దులు వేసేందుకు రెవెన్యూ అధికారులు గురువారం వెళ్లారు. ఎన్నోఏళ్ల నుంచి తమ ఆధీనంలో ఉన్న భూములను తీసుకోవద్దని రైతులు అడ్డుకున్నారు. తమకు న్యాయం చేయాలని వీరంతా కోరారు. ఇది ప్రభుత్వ భూమి కావడం వలన, రైతులకు ఎటువంటి పట్టాలు లేకపోవడంతో దీన్ని ప్రభుత్వం జిఎంఆర్ సంస్థకు కేటాయించిందని రెవిన్యూ అధికారులు బాధితులకు తెలిపారు. అయినప్పటికీ అధికారులు హద్దు రాళ్లను పాతారు. సర్వేయర్ ముదికేశ్వరరావు, ఆర్ఐ కిషోర్, విమానాశ్రయ అధికారి సుబ్బారావు తదితరులు హద్దులు వేసేందుకు వెళ్లారు.



ఎవరెలా స్పందించారో?

• అభ్యర్థుల గుండెల్లో దడ • ఫలితాల వెల్లడికి మరో 4 రోజులే

ప్రజాశక్తి - విజయనగరంప్రతినిధి

ఇప్పటికే ఎన్నోసార్లు కూడికలు, తీసివేతలతో గెలుపోటములపై లెక్కించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఇంకా పలు సందేహాలు, అనుమానాలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఫలితాల వెల్లడికి మరో నాలుగు రోజులే సమయం ఉండడంతో అందరి అభ్యర్థుల్లోనూ ఉత్కంఠ కనిపిస్తోంది. కరుడుగట్టిన కార్యకర్తలైతే నరాలు తెగే ఉత్కంఠతో ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కేవలం కుల సమీకరణాలు, బంధుత్వాలు, వివిధ పార్టీలకు ఉన్న అనుకూల, ప్రతికూల అంశాలతోపాటు మరిన్ని కోణాల్లో ఆసక్తికరమైన చర్చనడుస్తోంది. గడిచిన పదేళ్లలో ఒక దఫా టిడిపి, మరో దఫా వైసిపి అధికార, ప్రతిపక్ష పాత్రలు పోషించాయి. ఈనేపథ్యంలో ఇరు ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమం, విధ్వంసాలు, ప్రతీకార చర్యలపై జిల్లాలో లోతైన చర్చనడుస్తోంది. అభివృద్ధి విషయానికి వస్తే వైసిపి హయాంలో జిల్లాకు మెడికల్ కాలేజీ, గ్రామ సచివాలయాలు, నాడు - నేడు భవనాలు మినహా ఆ స్థాయిలో చెప్పుకోదగ్గవేమీ లేదనే చర్చనడుస్తోంది. ఇందులోనూ ఈ భవన నిర్మాణాల బకాయిలు రూ.కోట్లలోనే ఉన్నాయి. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో చాలా మంది సర్పంచులు ఏళ్ల తరబడి అప్పుల్లో ఉన్నారు. ఇది వైసిపికి ప్రతికూల అంశంగా ఉటుందని పలువురు భేరీజు వేస్తున్నారు. ఎయిర్‌పోర్టు, గిరిజన వర్శిటీల గుర్తించి వైసిపి ప్రచారం ఎన్నికల్లో బాగానే ప్రచారం చేసినప్పటికీ, వాటివల్ల ఓట్లు కురిసే అవకాశం లేదని ఒక విశ్లేషణ. గిరిజన వర్సిటీ కొత్తవలస ప్రాంతం నుంచి మెంటాడ మండలానికి మార్చుచేసి శంకుస్థాపన చేయడం మినహా పనులు ఇంకా ప్రారంభించలేదు. వీటిపై ఆశ నిరాశల మధ్య ఉన్న జనం ఓటింగ్ సమయానికి అధికార పార్టీకి వ్యతిరేకంగా మారిపోయారన్న అంచనాలు చాలామంది నోట వినిపిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పరిశీలిస్తే తోటపల్లి, రామతీర్థసాగర్ ప్రాజెక్టులకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కువ నిధులు ఖర్చు చేశాయి. గడిచిన పదేళ్లలో పరిశీలిస్తే వైసిపి కన్నా టిడిపియే ఎక్కువ నిధులు కేటాయించాయి. ఇది వైసిపి ప్రతికూల అంశమేనన్న అంచనాలు వినిపిస్తున్నాయి. రైతు భరోసా మినహా రైతులను కరువు కాటకాల్లో ఆదుకోవడంలోగానీ, ఇన్‌పుట్ సబ్సిడీ పెంపులోగానీ వైసిపి ఉదారంగా వ్యవహరించలేదన్న అసంతృప్తి రైతుల్లో ఉంది. గత మూడేళ్లల్లో జిల్లాలోని భీమిసింగి సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ పేరుతో మూసివేయగా, అప్పుల పేరుతో లచ్చయ్యపేట సుగర్స్‌ను ఎత్తివేశారు. దీంతో, చెరకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. సుమారు 90కిలోమీటర్ల దూరంలోవున్న సంకిలి ఫ్యాక్టరీకి తీసుకెళ్లడం రైతులకు భారంగా మారింది. ఇవన్నీ రైతాంగంలో వైసిపి పట్ల వ్యతిరేకత చూపి ఉండవచ్చని విశ్లేషణలు ఉన్నాయి. ఈ విషయంలో చంద్రబాబు కూడా రైతులను పెద్దగా ఆదుకునేది లేదనే వాదన కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల జిల్లాలోని ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత వైసిపికి వ్యతిరేకంగా పనిచేశారనే వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు వైసిపి పాలన, విధానాల పట్ల తొలి నుంచీ గుర్రుగానే ఉన్నారు. జిల్లాలో వలసకూలీలు చాలా ఎక్కువ. పాలకుల వల్లే పిల్లలు, తల్లిదండ్రులను వదిలేసి సుదూర ప్రాంతాలకు వలసపోవాల్సి వచ్చిందనే భావన వ్యక్తమైంది. ఈనేపథ్యంలో వలస కూలీల్లో ఎక్కువ మంది సాధారణంగానే పార్టీతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసే అవకాశాలే జిల్లాలో ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ టిడిపికి కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి. అయితే, వైసిపికి కలిసొచ్చే అంశాలు లేకపోలేదు. సంక్షేమ పథకాలు ఎక్కువ మంది జనాన్ని ఆకర్షించాయనడంలో సందేహం లేదు. ఈసారి వృద్ధులు, వికలాంగులతోపాటు సామాజిక పింఛన్లు అందుకుంటున్నవారిలో వైసిపికి అనుగుణంగానే ఎక్కువ మంది ఉన్నారనడంలో సందేహం లేదు. ఆరోగ్య శ్రీ పథకం కింద లబ్ధిపొందిన టిడిపి కుటుంబాలవారు కూడా వైసిపి పట్ల సానుకూలంగా మారిపోయారు. ముఖ్యంగా ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణాల మాఫీ, చేయూత, అమ్మఒడి తదితర పథకాలు మహిళలను చాలా వరకు ఆకర్షించాయి. ఈ నేపథ్యంలోనే మహిళా ఓట్లు తమకు ఎక్కువగా వస్తాయన్న ఆశాభావం వైసిపి నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కానీ, మహిళల్లో ఉద్యోగులు, నిరుద్యోగులు మాత్రం వైసిపికి వ్యతిరేకంగానే ఉన్నారన్నది మరో విశ్లేషణ ఉంది. విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న ఇళ్లు తదితర పథకాలు వైసిపికి బాగా కలిసొచ్చే అంశాలు. ఈనేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో కుల, మత రాజకీయాలు పెద్దగా పనిచేయకపోవచ్చు. ఓట్ల కోసం ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులూ పోటాపోటీగా డబ్బులు పంచడం వల్ల ఈ ప్రభావం కూడా పెద్దగా కనిపించకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. సంక్షేమ పథకాలు వైసిపికి ఎంతో మేలు చేకూర్చే అవకాశం ఉన్నప్పటికీ, పోలింగ్‌కు పది రోజుల ముందు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రయోగించిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు' బాగా జనాల్లోకి వెళ్లింది. జిల్లాలో మెజార్టీ ప్రజలకు ఎంతో కొంత భూమి, ఇంటి స్థలాలు, ఇళ్లు ఉన్నాయి. వైసిపి అమలు చేస్తున్న ఈ యాక్టు వల్ల ఈ స్థిరాస్తులు కోల్పోతామనే అభద్రతా భావం ఎక్కువ జనాల నోట వినిపిస్తోంది. ఈ ప్రచార అస్త్రం టిడిపి అభిమానులు, సంక్షేమ పథకాల వల్ల సంతృప్తి చెందినవారిని సైతం కలవరానికి గురిచేసిందని, అదే జరిగితే ఆ మేరకు టిడిపి లాభపడే అవకాశం లేకపోలేదని జనం చర్చించుకుంటున్నారు. జనం ఏ అంశానికి ఎంతెంత ప్రాధాన్యతనిచ్చి, ఓట్ల రూపంలో తీర్పు నిచ్చారనేది ఈనెల 4వ తేదీ వరకు వేచిచూడాల్సివేంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల అందరినోటా గెలుపు ధీమా వినిపిస్తోంది.



చెరువు కబ్జా

కబ్జాకు గురైన చెరువు ఇదే

18 మంది పేరున 15 ఎకరాలు రిజిస్ట్రేషన్ • రెవెన్యూ అధికారులకు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-డెంకాడ

జిల్లా వ్యాప్తంగా సాగుదారుల అసైన్డ్ భూములను కారుచౌకగా కొట్టేస్తున్న వ్యవహారంపై అంతటా చర్చ జరుగుతున్న వేళ డెంకాడ మండలం గుణుపూర్‌పేటలో చెరువు కబ్జా వెలుగు చూసింది. భూముల విలువ కోట్లాది రూపాయలు కావడంతో కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లు ఎక్కడపడితే అక్కడ స్థలాల ఆక్రమణ జరుగుతోంది.

గుణుపూర్‌పేట గ్రామంలో డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న ఆనందరాజు చెరువును వైసిపికి చెందిన కొంతమంది తప్పుడు సర్వే నెంబర్లతో 15 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన రైతులు మండల రెవెన్యూ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ చెరువును పరిశీలించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. సర్వే నెంబరు 60/3లో ఆనందరాజు చెరువు గర్భం మొత్తం 22 ఎకరాల 24 సెంట్లలో విస్తరించి ఉంది. ఇందులో 14 ఎకరాల 94 సెంట్లు భూమిని 18మంది రైతులు తమ పేరున భోగాపురం రిజిస్టర్ కార్యాలయంలో ఈనెల 24న రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ చెరువు కింద సుమారు 37ఎకరాల ఆయకట్టు ఉంది. పూర్వం నుంచి ఉన్న ఈ చెరువును రైతులు 15ఎకరాలు వరకు ఆక్రమించుకున్నారని మిగతా రైతులంతా ఫిర్యాదు చేశారు. ఇంతటి ఘోరాన్ని ఎప్పుడూ చూడలేదని, ఏకంగా చెరువునే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం దుర్మార్గమని రైతులు అంటున్నారు. ఈ విషయమై రెవిన్యూ అధికారులను ప్రశ్నించగా ఆటో మ్యుటేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, తమకు ఎటువంటి సంబంధమూ లేదని రెవెన్యూ అధికారులు చెప్పారని రైతులు అంటున్నారు. దీనిపై రిజిస్ట్రేషన్‌శాఖ డిఐజికి, ఇతర అధికారులకు కూడా రైతులు ఫిర్యాదు చేశారు.అధికారులు స్పందించి చెరువును స్వాధీనం చేసుకొని, తమకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిందాల్ కార్మికుల సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తా

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు • జిందాల్ యాజమాన్యంతో చర్చలు విఫలం

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ మూసివేత సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు.. కార్మికులకు హామీనిచ్చారు. జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికులు చేపట్టిన నిరసన శిబిరం గురువారం 12వ రోజుకు చేరింది. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిందాల్ పరిశ్రమ యాజమాన్యంతో స్థానిక నాయకులతో కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో కంపెనీ ఎమ్‌డి దినేష్ శర్మ, కంపెనీ జిఎం సింక్లాల్, హెచ్‌ఆర్ డిజిఎం గోపాలకృష్ణ పరిశ్రమ తరపున పాల్గొన్నారు. కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, కొత్తవలస ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, కార్మిక నాయకులతో కలిసి మజ్జి శ్రీనివాసరావు పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. ఈ చర్చలు విఫలం కావడంతో చేసేది లేక ఛైర్మన్, నాయకులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లేఆఫ్ ప్రకటించడాన్ని తప్పుపట్టారు. పరిశ్రమలో 30-40 ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులు ఉన్నారని, వారిని యాజమాన్యం రోడ్డుపైకి నెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కంపెనీ మూసివేసి 12 రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని మండిపడ్డారు. కుటుంబాలతో ఉన్న కార్మికులు ఏమి చేయాలో తోచని పరిస్థితిని, దుస్థితిని యాజమాన్యం తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలని డిమాండ్‌చేశారు.



చర్చల్లో జిందాల్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిశ్రమను తెరిపించడానికి శాయశక్తులా కృషి చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, వైసిపి నాయకులు మేలాస్త్రి అప్పారావు, గొరపల్లి రవి, సిఐటియు జిల్లా నాయకులు జి.అప్పారావు, కార్మిక నాయకులు నమ్మి చినబాబు, పిల్ల అప్పలరాజు, లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాదు, బొట్ట రాము, సలాది భీమయ్య, బాలిబోయిన ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కార్మిక సంఘ నాయకుల అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక ,ఉద్యోగ, సంఘాల నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్టీసి కార్మిక సంఘం నాయకుల అక్రమ అరెస్టులు ఎత్తివేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ పేరుతో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందర్రావు, బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిర్రా శాంసన్, ఎన్ఎంయు తణుకు డిపో కార్యదర్శి సుబ్బారావుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 మందిని ఆర్టీసీ యాజమాన్యం అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ సి ఐటియు, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ విజయనగరం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో గురువారం ఎన్‌పిఆర్ భవన్ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు కార్మిక నాయకులపై అక్రమ సస్పెన్షన్లను తక్షణమే ఎత్తివేయాలని పెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ , నగర కార్యదర్శి బి .రమణ, ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు, డిపో కార్యదర్శి చంద్రయ్య, ఆర్టీసి, ఎస్‌సి, బిసి నాయకులు జి. ప్రసాదరావు, టివికెఎస్ నారాయణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.త్రినాధ్ మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సమావేశం జరుపుకుంటే అది కోడ్ ఆఫ్ కాంటాక్ట్ కిందకు ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఎలాంటి విచారణ లేకుండా సస్పెన్షన్లు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బేషరతుగా సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు చేసే పోరాటానికి కార్మిక ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి, మహిళా సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. పాలకులు , అధికారులు భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసం నిలబడుతున్న సుందరయ్య లాంటి వారిని సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్షులు సిహెచ్ వి రావు, మహిళా కన్వీనర్ బి. లక్ష్మి, వివిధ సంఘాల నాయకులు నవీన్ కుమార్ హరీష్ ,సుమంత్ కుమార్, రఫీ, డిఎస్ రావు, కెఆర్ కుమార్, సిహెచ్ రాజేశ్వరి సావిత్రి రాములమ్మ, ఎస్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాములు

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం



విజయనగరంలో సిఐటియు ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం జిల్లా అంతటా గురువారం ఘనంగా జరిగింది. వాడవాడలా ఎర్రజెండా రెపరెపలాడింది. నాయకులు ఎక్కడికక్కడ సిఐటియు జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఐటియు 1970లో ఐక్యత, పోరాటం అనే నినాదంతో కార్మికులను శ్రమ దోపిడీ నుంచి విముక్తి చేసేందుకు ఏర్పడిందని గుర్తు చేశారు. అతి కొద్ది మందితో ఏర్పడిన సిఐటియు దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో విస్తరించి నేడు దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా ఉందని అన్నారు. అనేక పోరాటాలు నిర్వహించి కార్మికులకు అండగా నిలబడుతోందన్నారు. కులమ, మత, జాతి, పర బేధాలు లేకుండా అందరినీ ఒకే తాటిపైకి నిలెట్టి కనీస వేతనాలు, కార్మిక హక్కుల కోసం పోరాడుతోందన్నారు. కార్మిక రాజ్య స్థాపన, రాజ్యాంగ రక్షణ వంటి లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్నదని తెలిపారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు, పంచాయతీ కార్మికులు, ఉద్యోగ, కార్మికులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. కానీ నేడు ప్రభుత్వ విధానాల దుష్ఫలితంగా కార్మిక హక్కులు, చట్టాలు కాలరాయబడుతున్నాయని, వాటిని కాపాడుకునేందుకు భవిష్యత్తులో సిఐటియు ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు.

విజయనగరం ప్రజా సంఘాల కార్యాలయంలో సిఐటియు జెండాను నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, నాయకులు బి.సుధారాణి, మెడికల్ సేల్స్ రిప్రంజటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్, వి.రాములు, మెడికల్ రిప్‌లు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక శానిటరీ మస్తర్ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సిఐటియు జెండాను గౌరీష్ ఎగుర వేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సిఐటియు జెండాను ఆ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి.కృష్ణ, పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు కనకరాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.కాంతారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, కార్మికులు గోవిందు, శ్రీను ,నాగరాజు, కోటి కనకరాజు, లక్ష్మణ పాల్గొన్నారు.

దత్తిరాజేరు : కోమటిపల్లి ఆటో జంక్షన్ వద్ద సిఐటియు జెండాను ఆటో యూనియన్ కార్యదర్శి బి.అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో పి.రాము, వై.ఈశ్వరరావు, టి.హరీష్, బాలు, ఈశ్వరరావు, బాషా, నాగరాజు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలో వెంకటరమణపేట క్వారీలు, కొత్తూరు, పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ ముత్యాలు, క్వారీ యూనియన్ నాయకులు వై.భాస్కర్, డి.గణేష్, వి.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : స్థానిక సిఐటియు కార్యాలయం దగ్గర సిఐటియు గరివిడి డివిజన్ కార్యదర్శి ఎ. గౌరినాయుడు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ యూనియన్ నాయకులు సన్యాసినాయుడు, పాపి నాయుడు, సాంబ, అప్పలనాయుడు, ఫేకరు యూనియన్ నాయకులు ఉత్తరవెల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి బాబూరావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నగర పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



బొబ్బిలి.. సిఐటియు జెండాను ఎగుర వేస్తున్న నాయకులు గౌరీష్



దత్తిరాజేరు.. సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న బి.అప్పలనాయుడు



గజపతినగరం.. సిఐటియు జెండాకు అభివాదం చేస్తున్న నాయకులు, కార్మికులు



శృంగవరపుకోట.. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు, క్వారీ కార్మికులు



నెల్లిమర్ల.. జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు బాబూరావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఈశ్వరమ్మ

అధిక పని గంటలతోనే కనీస వేతనం

ప్రజాశక్తి-రామభద్రపురం

ఉపాధిహామీ పథకంలో వేతనదారులు పని అధిక గంటలు చేస్తే కనీస వేతనం గిట్టు బాటు అవుతుందని ఎంపిడిఒ ఈశ్వరమ్మ సూచించారు. మండల పరిధిలోని గొల్లల పేట గ్రామంలో గురువారం ఉపాధిహామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడారు. ఉదయం, మధ్యాహ్నం 2 పూటలా పనిచేయడం ద్వారా అధిక వేతనం వస్తుందని, ఆదిశగా వేతనదారులు ఎక్కువ పనులు చేయాలని కోరారు. పని ప్రదేశం వద్ద మంచినీటి సౌకర్యం, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెరువు పనులు ఎక్కువ లోతు ఉండే విధంగా తవ్వకాలు చేయాలని అన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఒ త్రినాధనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇండియా' అధికారంలోకి రావడం ఖాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇండియా కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి పదేళ్ల పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. బ్యాంకింగ్, బీమా, రైల్వే, ఎయిర్ లైన్స్, లాభాల బాటలో నడిచే పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించారని విమర్శించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఓట్లు వేసి ఇండియా కూటమికి మద్దతు ఇచ్చారని చెప్పారు.

మధుపాడలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని మధుపాడ గ్రామంలో గురువారం సిఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు. ప్రతి ఒక్కరినీ నేరుగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల వాహనదారులను వారి అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఉన్న సందర్భంగా ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతున్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లోకి అపరిచిత వ్యక్తులు ఎవరైనా వచ్చినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని నారాయణి హృదయ ఆస్పత్రిలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యులు పెంట సునీల్ కుమార్, బి.లావణ్య చెప్పారు. ఆస్పత్రిలో బిపి, మధుమేహం, హెచ్‌బిఎ 1సి, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉచితంగా చేస్తామని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వికలాంగ చిన్నారులను గుర్తిస్తున్న సిబ్బంది

వికలాంగ చిన్నారుల గుర్తింపు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వికలాంగ చిన్నారులను గుర్తించి బడిలో చేర్పించేందుకు భవిత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో సర్వే చేపట్టారు. ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల బాస్కరరావు పర్యవేక్షణలో చదువుకు దూరంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటివరకు 16 మందిని గుర్తించారు. జూన్ 9వ తేది వరకు సర్వే కొనసాగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.సత్యవతి, సిహెచ్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

1న హనుమాన్ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూన్ 1న హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు పంచముఖాంజనేయ స్వామి దేవాలయం కమిటీ ప్రాజెక్టు ఛైర్మన్ మడిపల్లి వెంకటాచలం తెలిపారు. గురువారం దేవాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు , సింధురార్చన, లక్ష తమలపాకులతో అర్చన జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి మహా అన్న ప్రసాద వితరణ సుమారు 7 వేల మందికి నిర్వహిస్తామని తెలిపారు. కన్వీనర్ కామరాజు మాట్లాడుతూ సాయంత్రం 5గంటలకు చిన్నపిల్లలతో సింధురార్చన కార్యక్రమం జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు పెంటపాటి రమేష్,నాదం తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఓట్ల లెక్కింపు : కలెక్టర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నిబంధనల ప్రకారం ఓట్ల లెక్కింపు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజవర్గానికి సంబంధించిన కౌంటింగ్ సూపర్‌వైజర్లకు, కౌంటింగ్ అసిస్టెంట్లకు వచ్చే నెల 4న జరగబోయే కౌంటింగ్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లెక్కింపు వద్ద ఎటువంటి తేడాలు రాకుండా చూడాలని సూచించారు. అనంతరం సదరు ఉద్యోగులకు కౌంటింగ్ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించాలనే విషయాలను తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికార్లు డి. ధర్మరాజు, జె. రామారావు, ప్రవల్లికప్రియ పాల్గొన్నారు.

సీక్రసి అఫ్ ఓటింగ్‌ను పాటించాలి : జెసి



మాట్లాడుతున్న జెసి కార్తీక్

విజయనగరంకోట : ఓట్ల లెక్కింపు లో ప్రధానంగా పాటించవలసిన అంశం సీక్రసి అఫ్ ఓటింగ్ అని, ముఖ్యంగా పోస్టల్ బాలెట్ కౌంటింగ్‌లో ఓటరు వివరాలను వెలువరిస్తే చర్యలు తప్పవని విజయ నగరం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. విజయనగరం, బొబ్బిలి నియోజకవర్గాలకు, పార్లమెంట్ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్‌కు జెఎన్‌టియు జివిలో జూన్ 4న ఉదయం 8 గంటల నుండి లెక్కింపు ప్రారంభం అవుతుందని, సిబ్బంది 6 గంటలకే రిపోర్ట్ చేయాలని తెలిపారు. . జెఎన్‌టియు జివిలో జరిగే ఓట్ల లెక్కింపు సిబ్బందికి గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జె.సి కార్తీక్ మాట్లాడుతూ మొదట పోస్టల్ బాలెట్ లెక్కింపు జరుగుతుందని, అరగంట తర్వాత ఇవిఎంల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. లెక్కింపు పూర్తయ్యే వరకు టేబుల్ వద్ద నుండి సిబ్బంది వెళ్లకూడదని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌కు వేర్వేరుగా పోస్టల్ బ్యాలెట్‌కు, ఇవిం ల కౌంటింగ్‌కు వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయనగరం పార్లమెంట్‌కు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ లెండి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుందని తెలిపారు.

ఇవిఎంల కౌంటింగ్ కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్(గజెటెడ్), ఒక కౌంటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్ స్టాఫ్ ఒకరు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని, ప్రతి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక సహాయ రిటర్నింగ్ అధికారి, ఒక కౌంటింగ్ సూపర్ వైజర్ (గజెటెడ్), ఇద్దరు కౌంటింగ్ అధికారులు (గజెటెడ్) , ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. అసెంబ్లీ పోస్టల్ బాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో కేంద్రంలో నాలుగు టేబుళ్లను, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం 20టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇవిఎంల ఓట్ల లెక్కింపు కేంద్రంలో వరుసకు ఏడు చొప్పున మొత్తం 14టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకూ అనుమతి ఉండదని చెప్పారు. ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, 17 సి-ఫారం, తెల్ల కాగితం మాత్రమే వారితో తీసుకు రావాలని అన్నారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల.. శిక్షణలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి



బొబ్బిలి.. శిక్షణలో మాట్లాడుతున్న ఆర్‌ఒ సాయిశ్రీ

ఓట్ల లెక్కింపుపై పూర్తి అవగాహన

బొబ్బిలి : ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలక ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.సాయిశ్రీ సూచించారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఓట్ల లెక్కింపులో పాల్గొంటున్న కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, తదితర సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్‌లో ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు నిర్వహించాలన్నారు. సొంత ఆలోచనలు, అభిప్రాయాలకు ఆస్కారం లేదన్నారు. సిబ్బంది నాలుగో తేదీ ఉదయం 6 గంటలకే లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. కేటాయించిన సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇస్తామని, వాటిని తప్పనిసరిగా ధరించి రావాలని ఆదేశించారు. బొబ్బిలి నియోజకవర్గం (అసెంబ్లీ, పార్లమెంట్) లెక్కింపు జెఎన్‌టియు-జివిలో జరుగుతుందని చెప్పారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు జెసి రాజు, సిహెచ్‌జె.ప్రవీణ్ కుమార్, డిటి చిన్నారావు ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన లక్పించారు. కార్యక్రమంలో ఎఆర్‌ఒలు త్రినాథరావు నాయుడు, రాజారావు, సులోచనా రాణి, రాజ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, హెచ్‌డిటి రెడ్డి సాయికృష్ణ, ఎఎస్ఒ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

తెలుగు పద్యాలపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పిల్లలు తెలుగు పద్యాలపై పట్టు సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. లక్ష్మి అన్నారు. విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా గురువారం విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఆర్.ఈశ్వర్ పిల్లలకు కథలు చెప్పి వారితో రాయించారు. పిల్లలకు పద్యాలు, శ్లోకాలు నేర్పించారు. షణ్ముఖప్రియ సంగీతం, డాన్స్ నేర్పించారు. ఇంకా కేరమ్స్, చెస్ ఆడించారు. కార్యక్రమంలో రిటైర్డు టీచర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

కథలతోనే కనువిప్పు

కథలతో పిల్లల్లో కనువిప్పు కలిగించవచ్చని గాజులరేగ శాఖ గ్రంథాలయ అధికారి ఎం. లక్ష్మణరావు అన్నారు. గురువారం స్థానిక గాజులరేగ శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలు చెప్పి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నీతికథలు, చారిత్రక కథలు పిల్లల్లో నిగూఢంగా దాగి ఉన్న జ్ఞానాన్ని పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయని లక్ష్మణరావు అన్నారు కార్యక్రమంలో సుమారుగా 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

పైపులైన్ లీకుల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో పైపులైన్ లీకులను నివారించేందుకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. సిబ్బందిని కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఇంజినీరింగ్, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల్లో తాగునీరు సరఫరా చేసే సమయంలో ఎమినిటీ సెక్రటరీలు పర్యటించి లీకులను గుర్తించి, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలో పూర్తి స్థాయిలో పైపులైన్ లీకులను నివారించాలని కోరారు. ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేసేందుకు సహకరించాలని, తాగునీటిని వృథా చేయొద్దని కోరారు.

రమణమూర్తి మృతికి పలువురి సంతాపం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సీనియర్ న్యాయవాది వైవి రమణమూర్తి మృతికి ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి జి.సూరిదేముడు, బి.సత్యనారాయణ, న్యాయవాదులు కోర్టు హాల్లో గురువారం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జి.సూరిదేముడు మాట్లాడుతూ అందరితో కలిసి మెలిసి ఉండే న్యాయవాది రమణమూర్తి కొద్ది నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపి పి.కేశవరావు, న్యాయవాదులు బి.త్రిమూర్తులు, కెవిఎస్ రామరాజు, డబ్ల్యుఎన్ శర్మ, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, పి.నాగేశ్వరరావు, బివిఎస్ రామారావు, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు, సిహెచ్‌ఆర్ఎ నాయుడు, గేదెల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



తోటల్లో సంచరిస్తున్న హైనా

హైనా హల్‌చల్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని కొండపేట సమీపంలో కొండను ఆనుకొని ఉన్న తోటల్లో గురువారం హైనా (దుమ్మలగుండు) హల్‌చల్ చేసింది. కొండపైనుంచి దిగిన హైనా కాలనీలోకి చొరబడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అంతలోనే అప్రమత్తమై తాళ్లతో బంధించారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. ఇటీవల రామతీర్థం, బొప్పడాం, గొర్లెపేటలో కూడా హైనా హల్‌చల్ చేసింది.

ఎండిఎం కార్మికులకు శిక్షణ

ప్రజాశక్తి-తెర్లాం

తెర్లాంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఎంఇఒ-2 ఆర్.పాపారావు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో మెనూ ప్రకారం ఎలా వంటలు చేయాలో వీడియోల ద్వారా వివరించారు. వివిధ రకాల వంటకాలను స్టాల్స్ రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీనిధి పాఠశాలను ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రమౌళి

విద్యతోనే సమాజాభివృద్ధి

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఫిజిక్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డాక్టర్ కె.చంద్రమౌళి అన్నారు. పట్టణంలోని శ్రీనిధి పాఠశాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తేనే సమాజానికి ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు సూచించారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వాసు విద్యాసంస్థల వ్యవస్థాపకులు రౌతు రామ్మూర్తి, కరస్పాండెంట్ వాసుదేవరావు, మేనేజింగ్ పార్ట్నర్ దాశరథి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ముద్దాయికి 6 నెలల జైలుశిక్ష

ప్రజాశక్తి-శృంగవరపుకోట

చెక్‌బౌన్స్ కేసులో జాగరపు వెంకట అప్పారావు అనే వ్యక్తికి ఆర్నెల్ల జైలుశిక్ష విధిస్తూ ఎస్.కోట న్యాయమూర్తి సబ్బవరపు వాణి గురువారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు శ్రీనివాసరావు నుంచి జామి మండలం కుమరాం గ్రామానికి చెందిన టీచర్ జాగరపు వెంకట అప్పారావు రూ.2 లక్షలు అప్పు తీసుకుని రూ.లక్షా 50 వేలకు చెక్ ఇచ్చారు. ఆయన చెప్పిన సమయంలో చెక్కును శ్రీనివాసరావు బ్యాంకులో వేయగా, అప్పారావు ఖాతాలో డబ్బులు లేనట్టు రశీదు ఇచ్చారు. దీంతో శ్రీనివాసరావు ఎస్.కోట కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశారు. న్యాయమూర్తి వాణి కేసును విచారించిన అనంతరం చెల్లని చెక్కు ఇచ్చి మోసగించినందుకు గాను 6 నెలల జైలు శిక్ష విధించారు. రూ.1.50 లక్షలు చెల్లించకుంటే 9 శాతం వడ్డీతో సహా అసలు మొత్తం నెల రోజుల్లో చెల్లించాలని, లేకుంటే మరో 6 నెలలు అధికంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పునిచ్చారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి-వేపాడ

రైతులకు 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎఒ యశ్వంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 కిలోల జీలుగు కట్టెజనుములకు రూ.440, పిల్లిపెసర 8 కిలోలకు రూ.536 చెల్లించి, ఆర్‌బికెల ద్వారా పొందవచ్చని చెప్పారు.

వేపాడలో పారిశుధ్య పనులు

వేపాడ : మండల కేంద్రమైన వేపాడ గ్రామంలో పారిశుధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలో పేరుకుపోయిన పూడికను, చెత్తను జెసిబితో తొలగించారు. ఆ చెత్తను ట్రాక్టర్ ద్వారా యార్డుకు తరలించారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి గౌరి, వార్డు సభ్యులు మెలిపాక రమణ పర్యవేక్షించారు.

బిసిజి టీకా తప్పనిసరి

వేపాడ : బిసిజి టీకా తప్పనిసరిగా వేసుకోవాలని వేపాడ పిహెచ్‌సి వైద్యులు ఎ.ధరణి తెలిపారు. పిహెచ్‌సి పరిధిలోని గ్రామాల్లో గురువారం బిసిజి టీకాలు వేశారు. ఈ టీకా వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు.

సేవ చేయడం సంతృప్తినిచ్చింది

గ్రంథాలయాధికారి రామభద్రరాజు



ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజలకు, పాఠకులకు సేవలందించడంలో సంతృప్తి ఉందని గంట్యాడ శాఖా గ్రంథాలయం అధికారి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు బుద్ధరాజు రామ భద్రరాజు అన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన ప్రజాశక్తితో తన ఉద్యోగ జీవిత అనుభవాలను పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

గంట్యాడ మండలం బుడతనాపల్లి గ్రామంలో జూన్ 1వ తేదీ 1962లో బుద్ధరాజు వెంకటపతిరాజు, అప్పల కొండమ్మ దంపతులకు రెండవ సంతానంగా జన్మించాను. పద్మశ్రీ నా వివాహమైంది. మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వెంకట మనోజ్ వర్మ హైదరాబాదులో ఇండియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కోడలు లిఖిత ఉన్నారు. కుమార్తె మౌల్యకాగా, అల్లుడు సాయితేజ వర్మ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. మనుమడు జయాన్స్ వర్మ.

నా విద్యాభ్యాసం ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు బుడతనాపల్లి గ్రామంలోనే సాగింది. ఇంటర్ గరివిడి శ్రీరామ్ జూనియర్ కళాశాలలోను, డిగ్రీ ఎంఆర్ కళాశాలలోను చదువుకున్నాను. సర్టిఫికెట్ ఇన్ లైబ్రేరియన్ సైన్స్ పాతూరి నాగభూషణం స్కూల్ ఆఫ్ లైబ్రేరియన్ సైన్స్‌లో చదివాను. 1990 ఆగస్టు 21న ఎంప్లాయిమెంట్ కార్యాలయం ద్వారా ఇంటర్వ్యూకు ఎంపికై లైబ్రేరియన్‌గా ఉద్యోగం సాధించాను. తొలుత బొబ్బిలిలో ఉద్యోగంలో చేరాను. ఆ తరువాత 1993 మార్చిలో గంట్యాడ మండలంలో గ్రంథాలయాధికారిగా బదిలీ అయ్యాను. 2000 సంవత్సరంలో జిల్లా కేంద్ర సహాయ గ్రంథాలయ అధికారిగా 2003 వరకు పనిచేసి, తరువాత అదే సంవత్సరం జూన్‌లో గంట్యాడకు బదిలీపై వెళ్లాను. 2004 డిసెంబర్‌లో గాజుల రేగ శాఖ గ్రంథాయానికి బదిలీపై వెళ్లి అక్కడే 2016 వరకు విధులు నిర్వహించాను. 2016 జూన్ 1 న డెంకాడ లైబ్రేరియన్ గా వెళ్లి 2022 వరకు కొనసాగాను. అదే ఏడాది డిసెంబర్ 19న గంట్యాడ మండలానికి బదిలీపై వచ్చాను. 2016, 2021 సంవత్సరంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ లైబ్రేరియన్‌గా అవార్డులు అందుకున్నాను. జయంతి రామలక్ష్మణమూర్తి పురస్కారం, రొంగలి పోతన్న ఛైర్మన్‌గాఉన్న కాలంలో అవార్డు పొందాను.

సుమారు 34 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాను. ఈ సమయంలోనే ఉద్యోగ సంఘం తరపున జిల్లాలోనూ రాష్ట్రంలోనూ అధ్యక్షులుగా, కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. ఆ సమయంలో ఉద్యోగులు అందించిన సహాయ సహకారాలు మరువలేనివి. ఉద్యోగుల తరపున అనేక పోరాటాలు చేసి ఉద్యోగులందరి మన్ననలు పొందాను. 1995 నుంచి 2000 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేశాను. 2001లో జనవరి నుంచి 2024 మే 31 వరకు జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షులుగా వ్యవహరించాను. అంతేకాకుండా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘంలో ప్రాంతీయ కార్యదర్శులుగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వర్తించాను. పాఠకులకు, ఉద్యోగులకు సేవ చేయడంలో ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది. విధి నిర్వహణలో సహకరించిన తోటి ఉద్యోగులకు, సిబ్బందికి ధన్యవాదాలు.